సాక్షి రంగారెడ్డి

సోమవారం । 1 । జనవరి । 2024



నూతనోత్సాహం..

నూతన సంవత్సరం పురస్కరించుకుని సోమవారం చిలుకూరు బాలాజీ ఆలయానికి భక్తులు పోటెత్తనున్నారు. 8లో▸



డ్రగ్స్ ముఠా అరెస్టు

రాజస్తాన్ నుంచి డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాను ఎస్ఓటీ పోలీసులు శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. 8లో▸



ప్రోత్సాహం అవసరం

ఆధునిక యుగంలో విద్యవంతులను ప్రోత్సహించాలని పీవీ రాంరెడ్డి పీజీ కళాశాల సెక్రెటరీ శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

హిమాలయాల్లో నేషనల్ ట్రెక్కింగ్ క్యాంప్

పాల్గొన్న షాద్‌నగర్ ప్రభుత్వ డ్రిగీ కళాశాల విద్యార్థులు



ట్రెక్కింగ్‌లో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

షాద్‌నగర్: జాతీయ స్థాయి ట్రెక్కింగ్ శిక్షణ శిబిరంలో షాద్‌నగర్ విద్యార్థులు పాల్గొన్నారు. కేంద్ర యువజన, క్రీడ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని నర్కండలో ఆదివారం ట్రెక్కింగ్ క్యాంప్ నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నవీన్, ప్రకాష్, బద్రు, సావిత్రి, నవీన్‌కుమార్, రాఘవేందర్, ఆంజనేయులు, దివ్య వాణి హిమాచల్‌ప్రదేశ్‌కు తరలి వెళ్లి ట్రెక్కింగ్‌లో పాల్గొన్నారు. హిమాలయాల్లోని దూలదార్ రేంజ్ షిర్క్ ప్రాంతంలో శిక్షకుడు నిశ్చయరాంట ఆధ్వర్యంలో విద్యార్థులు మైనస్ నాలుగు డిగ్రీ కన్నా తక్కువ ఉష్ణోగ్రత వద్ద 2,746మీటర్ల ఎత్తున్న శిఖరాలను అధిరోహించారు. వారం రోజుల పాటు ఈ క్యాంప్ ఉంటుందని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

నేడు సందర్శనకు రాష్ట్రపతి నిలయం

రసూల్‌పురా: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం ప్రజల సందర్శనార్థం తెరిచి ఉంటుందని పరిపాలన అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 26 నుంచే రాష్ట్రపతి నిలయం సందర్శనకు ప్రజలను అనుమతి ఇస్తున్నామన్నారు. పరిపాలన అధికారి రజని మాట్లాడుతూ.. సంక్రాంతి సందర్భంగా జనవరి 13, 14వ తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుకింగ్ చేసుకోవచ్చని లేదా రాష్ట్రపతి నిలయంలోని బుకింగ్ కౌంటరులో కూడా టికెట్ బుక్ చేసుకోవచ్చన్నారు. ఒక్కో టికెట్ ధర రూ.50 అని తెలిపారు.

3న తాగునీటి సరఫరాకు అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి ఈ నెల 3న పలు ప్రాంతాల్లో 24 గంటల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు జలమండలి ప్రకటించింది. నగరానికి కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్ – 1లోని సంతోష్ నగర్ వద్ద నున్న 1600 ఎంఎం దయా ఎంఎస్ గ్రావిటీ మెయిన్ పైపులైనుకు జంక్షన్ పనులు చేపడుతున్న నేపథ్యంలో నీటి సరఫరాకు ఈ నెల 3వ తేదీ బుధవారం ఉదయం 6 నుంచి మరుసటి రోజు గురువారం ఉదయం 6 గంటల వరకు పలు రిజర్వాయర్ పరిధిలోని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొంది. అంతరాయం ఏర్పడే ప్రాంతాలివే: నగరంలోని మీరాలం, కిషన్ బాగ్, అల్జుబైల్ కాలనీ, సంతోష్ నగర్, వినయ్ నగర్, సైదాబాద్, చంచల్ గూడ, ఆస్మాన్ గఢ్, యాకుత్ పురా, మాదన్నపేట్, మహబూబ్ మాన్షన్, రియాసత్ నగర్, అలియాబాద్, బొగ్గుల కుంట, అఫ్జల్ గంజ్, నారాయణ గూడ, అడిక్ మెట్, శివం రోడ్, నల్లకుంట, చిలుకల గూడ, దిల్‌సుఖ్ నగర్ ప్రాంతం, బొంగులూరు, మన్నెగూడ ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జలమండలి వర్గాలు పేర్కొన్నాయి.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

తహసీల్దార్ ఫిర్యాదు

క్రిమినల్ కేసు నమోదు

బంజారాహిల్స్: బోగస్ ధ్రువీకరణ పత్రాలతో బంజారాహిల్స్ రోడ్ నెం. 3లో 2.25 ఎకరాల స్థలాన్ని కబ్జాకు చేసేందుకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నెం. 3 ప్లాట్ నెం.8-సి ఆఫ్ డీజేహెచ్ఎంకు చెందిన ఈ స్థలంలో కొంత కాలంగా అక్రమణదారులు చొరబడి తామే యజమానులమంటూ అసాంఘిక కార్యకలపాలాకు, కబ్జాలకు యత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జాదారులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దీప్తి అవెన్యూ ప్రైవేట్ లిమిటెడ్ ఉపేందర్‌రెడ్డి పేరుతో కబ్జాకు యత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో తహసీల్దార్ పేర్కొన్నారు. సదరు స్థలాన్ని ఇప్పటికే స్వాధీనం చేసుకుని తమ అధీనంలో ఉంచుకున్నామని, ఇది బోనా వెకెన్షియా స్థలమని వెల్లడించారు. ఈ స్థలంపై స్టేటస్‌కో కొనసాగించాలని హైకోర్టు కూడా ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను కబ్జాదారులు ఈ స్థలం నుంచి తొలగించి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తప్పుడు ధృవీకరణ పత్రాలు చూపిస్తున్నారని చుట్టూ రేకులు కూడా చుడుతున్నారని జనతా బార్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. కబ్జాదారులపై కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త స్వాగతం!

- 2023కు ఘనంగా వీడ్కోలు.. నూతన ఏడాదికి గ్రాండ్‌గా వెల్‌కం
- జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, అధికారులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కాల చక్రంలో మరో వసంతం కనుమరుగైపోయింది. పాత జ్ఞాపకాలను నెమరేసుకుంటూ.. కొత్త ఆశలు.. కొంగొత్త ఆశయాలతో జిల్లా వాసులు నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు విందులు, వినోదాల్లో మునిగితేలిన వారంతా 2023కు వీడ్కోలు పలికారు. సరిగ్గా అర్ధరాత్రి 11.59 నిమిషాలు దాటిన తర్వాత ఒక్క సారిగా హ్యాపీ న్యూ ఇయర్ అంటూ కేకలు వేశారు. కేకులు కట్ చేసి స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధువులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇదే సమయంలో కొంత మంది యువతీ, యువకులు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. కొత్త సంవత్సరంలో అడుగుపెట్టామనే ఆనందంతో పాటు విషాదం కూడా జిల్లా వాసులను వెంటాడింది. డిసెంబర్ 31 పేరుతో రాత్రి పొద్దుపోయిన తర్వాత పీకలదాక మద్యం సేవించి వాహనాలపై ప్రయాణించి ప్రమాదాలకు గురయ్యారు. తాగి ర్యాష్‌గా డ్రైవింగ్ చేస్తున్న వారు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసులకు చిక్కారు.

పారదర్శకంగా పనిచేస్తాం



ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలను అర్హులకు అందజేయడమే లక్ష్యంగా పని చేస్తాం. అధికారుల్లో అవినీతికి, నిర్లక్ష్యానికి ఆస్కారం లేకుండా ప్రజాపాలన కొనసాగిస్తాం. పరిపాలనలో మరింత పారదర్శకతను పాటించి, జిల్లా ప్రజలకు చేరవయ్యే లక్ష్యాలను నిర్దేశిస్తాం. జిల్లా కలెక్టర్‌గా కొత్త సంవత్సరంలోనూ ఈ అంశాలే ప్రధాన ఎజెండాగా పని చేస్తాం. 2024 ఏడాది ప్రతీ ఒక్కరికి శుభాలను చేకూర్చాలని.. ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తున్నా. జిల్లా ప్రజలందరు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని అభిలాషిస్తున్నా.

– గౌతం పొట్రు, కలెక్టర్

విజయాన్ని సొంతం చేసుకోవాలి



కొత్త ఏడాదిలో భిన్నమైన ఆలోచనలు, ఆశయాలతో ముందుకు వెళ్లాలి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మరింత పట్టుదలతో పనిచేయాలి. ఇందుకు కొత్తగా లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. సవాళ్లను అధిగమించి, విజయాలను కై వసం చేసుకోవాలి. గత స్ఫూర్తితో భవిష్యత్‌లో ముందుకు సాగాలి. కొత్త సంవత్సరం ప్రతీ ఒక్కరికి గెలుపును అందించే సంవత్సరం కావాలని ఆకాంక్షిస్తున్నా. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

– దిలీప్‌కుమార్, జెడ్పీ సీఈఓ, రంగారెడ్డి


హామీలు నెరవేరుస్తా



ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా. వారు ఆశించిన విధంగా సేవ చేస్తా. ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తా. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఆరు గ్యారంటీలను అర్హులకు అందేలా చూస్తాం. ప్రజా పరిపాలన అందిస్తాం. ఫార్మాసిటీ రద్దుకు కట్టుబడి ఉన్నాం. నియోజకవర్గాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతా. రోడ్లు, మురుగునీటి కాల్వలు, పార్కులు అభివృద్ధి చేస్తాం. కొత్త పరిశ్రమలను స్థాపనలతో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తాం.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

సాగు, తాగు నీరందిస్తా



కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గంలోని ప్రతీ ఎకరాకు సాగు నీరు అందించడమే లక్ష్యం. కల్వకుర్తి ప్రజల రుణం తీర్చుకునేందుకు పనిచేస్తా. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని డీ–82 కాలువను పూర్తిచేసి ఆమనగల్లు, మాడ్గుల మండలాలలోని గ్రామాలకు సాగునీరు, మిగిలిన మండలాల్లో తాగు, సాగునీరు అందించేందుకు కృషి చేస్తా. విద్య, వైద్య అందించి ప్రజా సేవలో ఉంటా. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్లు, రవాణా సౌకర్యం కల్పిస్తాం.

– కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే, కల్వకుర్తి

ప్రతిపక్ష హోదాలో పోరాటం



నిత్యం ప్రజల మధ్యే ఉంటాను. గత ప్రభుత్వ హయాంలో మంత్రి హోదాలో తాను ప్రారంభించిన పనులన్నీ పూర్తి చేయిస్తా. గొలుసుకట్టు చెరువుల అభివృద్ధి, సుందరీకరణ, పార్కులు, రోడ్లు, బాక్స్‌డ్రైన్ పనులు పూర్తి చేయిస్తా. మీర్‌పేట్, బడంగ్‌పేట్, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలు సహా ఇతర మండలాలు, గ్రామాలన్నింటిని అహ్లాదంగా తీర్చిదిద్దుతా. నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా నిలుపుతా. ఎన్ని అవరోధాలు, అడ్డంకులు ఎదురైనా.. ఎదురొడ్డి నిలుబడుతా. ప్రతిపక్ష హోదాలో ప్రజల గొంతుకగా పని చేస్తా.

– సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే, మహేశ్వరం

ప్రజల రుణం తీర్చుకుంటా



నూతన సంవత్సరంలో నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖసంతోషలతో ఆనందంగా ఉండాలి. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. తనకు మూడో సారి అవకాశం ఇచ్చిన ప్రజల రుణం తీర్చుకుంటా. రాబోవు రోజుల్లో పార్టీకి మంచి రోజులు రానున్నాయి. పెండింగ్ పనులు పూర్తి చేసిన నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా.

– కాలె యాదయ్య, ఎమ్మెల్యే, చేవెళ్ల

అభివృద్ధికి కార్యాచరణ



నియోజకవర్గ సమస్యల పరిష్కారమే లక్ష్యం. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన నిరుపేదలకు అందించేందుకు చర్యలు తీసుకుంటా. గతపాలకుల కారణంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. సొంత నిధులతో పాటుగా వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థల సాయంతో సమస్యలు పరిష్కరిస్తా. అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం. ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అహర్నిషలు కృషి చేస్తా.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

సిటీ బస్..టాప్‌గేర్

సాక్షి, సిటీబ్యూరో: సిటీ బస్సు ఇక రయ్‌రయ్‌మని పరుగులు తీయనుంది. నూతన సంవత్సరం కొత్త సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. కాలం చెల్లిన పాత బస్సుల స్థానంలో ఇప్పటి వరకు కొత్త వాటిని ప్రవేశపెట్టకపోవడంతో ప్రయాణికుల రద్దీకనుగుణంగా బస్సులను నడపడం అసాధ్యంగా మారింది. మహిళా ప్రయాణికులకు ఉచిత సదుపాయం కల్పించినప్పటి నుంచి ఆక్యుపెన్సీ రేషియో గణనీయంగా పెరిగింది. దీంతో పలు మార్గాల్లో అదనపు బస్సులను నడపడం తప్పనిసరిగా మారింది. ప్రత్యేకంగా ఉదయం, సాయంత్రం స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థుల డిమాండ్ మేరకు బస్సులు అందుబాటులో లేకపోవడంతో నగర శివార్లలోని ఇంజినీరింగ్ కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు కూడా రద్దీ కారణంగా సకాలంలో చేరుకోలేకపోతున్నారు. దీంతో యుద్ధప్రాతిపదికన 340 బస్సులను అద్దెకు తీసుకొనేందుకు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ చర్యలు చేపట్టింది. ఇంచుమించు కొత్త ఏడాది ఆరంభంలోనే ఇవి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం నగరంలోని వివిధ మార్గాల్లో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు సాగిస్తున్న ఏసీ ఎలక్ట్రిక్ బస్సుల తరహాలోనే మరో 500 కొత్త బస్సులను నగరంలో ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. జూన్ నాటికి ఈ బస్సులు అందుబాటులోకి రానున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో కొత్త సంవత్సరం 840 కొత్త బస్సులు నగరంలో వినియోగంలోకి రానున్నాయి. ఈ బస్సులతో ప్రయాణికులకు కొంత మేరకు ఊరట లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

కోటిన్నర దాటి..

- మహాలక్ష్మి పథకం గ్రేటర్‌లో విజయవంతంగా కొనసాగుతోంది. ఈ పథకాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రతి రోజు సుమారు 8 లక్షల మంది మహిళలు సిటీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నట్లు అంచనా. డిసెంబరు 9వ తేదీన ఈ పథకం అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే. గతంలో 4 నుంచి 5 లక్షల మంది మహిళలు సిటీ బస్సుల్లో ప్రయాణం చేయగా.. ఈ పథకం వినియోగంలోకి వచ్చిన తర్వాత ఏకంగా 8 లక్షలకు చేరింది. రోజు రోజుకు మహిళా ప్రయాణికులు పెరుగుతున్నారు. దీంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు మహిళా ప్రయాణికుల సంఖ్య కోటిన్నర దాటినట్లు అంచనా.
- గతంలో 67 నుంచి 69 శాతం వరకు ఉన్న ఆక్యుపెన్సీ రేషియో కూడా 80 శాతం దాటింది. రద్దీ రూట్‌లలో మహిళలు సైతం ఫుట్‌బోర్డుపై ప్రయాణం చేయాల్సివస్తోంది. మరోవైపు ఉచిత ప్రయాణ సదుపాయంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ఉదయం కాలేజీలకు వెళ్లే విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం పూట కాలేజీకి వెళ్లాల్సిన సమయంలో బస్సులు కిక్కిరిసిపోతుండటంతో ప్రయాణం అసాధ్యంగా మారుతోంది. దీంతో అదనపు ట్రిప్పులు ఏర్పాటు చేయాలని విద్యార్థినులు డిమాండ్ చేస్తున్నారు.

నగర శివార్లలో పెరిగిన రద్దీ..

ఉచిత ప్రయాణ సదుపాయంతో శివారు ప్రాంతాల్లోంచి నగరంలోకి రాకపోకలు సాగించే బస్సుల్లో రద్దీ భారీగా పెరిగింది. డిమాండ్‌కు తగినవిధంగా బస్సులు లేకపోవడంతో అందుబాటులో ఉన్న బస్సుల్లోనే ప్రయాణం చేయాల్సివస్తోంది. 'సాధారణంగానే కొద్ది రోజులుగా రాకపోకలు పెరిగాయి. ఈ పథకం వినియోగంలోకి వచ్చిన తర్వాత రద్దీ మరింత ఎక్కువైంది. కానీ కొత్త బస్సులు వచ్చే వరకు ట్రిప్పులను పెంచడం సాధ్యం కాదు కదా' అని ఆర్టీసీ అధికారి ఒకరు తెలిపారు. డిపోల్లో స్పేర్‌లో ఉండే 10 శాతం బస్సులను సైతం నడుపుతున్నట్లు చెప్పారు. గ్రేటర్‌లో ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తేనే రోడ్లపై వాహనాల రద్దీ తగ్గుతుంది. ఈ దిశగా కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని ఆశిద్దాం.

నూతన సంవత్సరంలో 840 కొత్త సర్వీసులు

- ఇప్పటికే 340 అద్దె బస్సులకు కార్యాచరణ
- త్వరలో మరో 500 ఎలక్ట్రిక్ బస్సులు
- రోజుకు 8 లక్షలకు చేరిన మహిళా ప్రయాణికులు
- గ్రేటర్‌లో 20 రోజుల్లో కోటిన్నర మంది..
- శివారు ప్రాంతాల్లో భారీగా పెరిగిన రద్దీ

ఫ్యామిలీ-24 టికెట్లు రద్దు

మహాలక్ష్మి పథకం వల్ల ప్రయాణికుల రద్దీ పెరిగిన నేపథ్యంలో గ్రేటర్‌లో జారీ చేసే ఫ్యామిలీ-24, టి-6 టికెట్లను నేటి నుంచి ఉపసంహరించుకోనున్నట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఎక్స్ వేదికగా తెలిపారు. ఫ్యామిలీ- 24, టి-6 టికెట్లను జారీ చేయాలంటే ప్రయాణికుల గుర్తింపు కార్డులను కండక్టర్లు చూడాలి. వారి వయసును నమోదు చేయాల్సి ఉంటుంది. మహాలక్ష్మి పథకం వల్ల రద్దీ పెరగడంతో ఫ్యామిలీ-24, టి-6 జారీకి కండక్టర్లకు చాలా సమయం పడుతోంది. ఫలితంగా బస్ సర్వీసుల ప్రయాణ సమయం కూడా పెరుగుతుంది. దీంతో ప్రయాణికులకు అసౌకర్యం కలిగించవద్దనే ఉద్దేశంతోనే ఈ టికెట్లను ఉపసంహరించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నుంచి సిటీ బస్సుల్లో ఈ టికెట్లు లభించవు.

సాయి పీఠాన్ని సందర్శించండి

గవర్నర్ తమిళిసైని ఆహ్వానించిన పీఠాధిపతి

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధి ప్రశాంతిహిల్స్‌లోని ద్వారకామయి సాయిబాబా పీఠాన్ని సందర్శించాలని పీఠాధిపతి శ్రీ గోపాలకృష్ణానంద స్వామిజీ గవర్నర్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి సత్కరించి ఆహ్వానపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ.. ఆహ్వానానికి గవర్నర్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. స్వామీజీ వెంట బీజేపీ తమిళనాడు ఇన్‌చార్జి, పార్టీ కోర్ కమిటీ సభ్యుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, స్వామిజీ కుమారుడు లలిత్‌సాయికుమార్ ఉన్నారు.



గవర్నర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గోపాలకృష్ణానంద స్వామిజీ

ముగిసిన ధ్యాన సంబురం



ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డిని, ట్రస్ట్ సభ్యులను సన్మానిస్తున్న నిర్వాహకులు

- 11 రోజుల పాటు సాగిన పత్రీజీ ధ్యాన మహాయాగాలు
- డిసెంబర్‌లో పత్రీజీ మహిళా ధ్యాన వేడుకలు

కడ్తాల్: మండల పరిధిలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్ క్షేత్రంలో పదకొండు రోజులుగా సాగిన పత్రీజీ ధ్యాన మహాయాగం వేడుకలు ఆదివారంతో ముగిసాయి. ఉదయం సామూహిక ధ్యానం అనంతరం ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, పీఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి, పరిణిత పత్రి తదితరులు ధ్యాన సందేశమిచ్చారు. ధ్యాన సంబురాలను విజయవంతం చేసిన ప్రతీ పిరమిడ్ మాస్టరుకు, ధ్యానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతీ వ్యక్తి జ్ఞానయోగి కావాలన్నదే పత్రీజీ సంకల్పమని వివరించారు. ఉత్సవాల విజయవంతానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ధ్యానులు పిరమిడ్ 18 ఆదర్శ సూత్రాలు పాటించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డిసెంబర్‌లో పత్రీజీ మహిళా ధ్యాన వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అనంతరం ధ్యానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల ముగింపు సందర్భంగా పిరమిడ్ ట్రస్ట్ సభ్యులను, ధ్యాన గురువులను, మాస్టర్లను, సంగీత విద్వాంసులను, ట్రస్ట్ చైర్మన్, సభ్యులతో పాటు, పరిమళ పత్రి, పరిణత పత్రి ఘనంగా సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ధ్యాన గురుమాత స్వర్ణమాల పత్రి, పీఎంసీ చైర్మన్ దాట్ల హన్మంతరాజు, సభ్యులు దామోదర్‌రెడ్డి, సాంబశివరావు, బాలకృష్ణ, నవకాంత్, భారతి, కేశవరాజు, మాధవి, శివప్రసాద్, కిషన్ రెడ్డి, శ్రీరాం గోపాల్ తదితరులున్నారు.



ముగింపు సంబురాల్లో కళాకారుల నృత్య ప్రదర్శన

అనిల్ కుమార్‌జోషికి 'మహర్షి వేదవ్యాస్'

కందుకూరు: మండల పరిధిలోని పులిమామిడి శ్రీనిఖిల్ చేతనా కేంద్రం నిర్వాహకుడు బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి »మహర్షి వేదవ్యాస్, వేద పురుష్« అవార్డు అందుకున్నారు. మహర్షి వేదవ్యాస్ ఇంటర్‌నేషనల్ వర్చువల్ వేద యూనివర్సిటీ, వేదిక వర్చువల్ విద్యాపీఠ్ ఆధ్వర్యంలో తాంత్రిక్ సైన్స్ టెక్నాలజీ విభాగం కింద డిసెంబర్ 20 నుంచి 22వ వరకు గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో ప్రపంచ వ్యాప్త కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో ప్రపంచ వ్యాప్తంగా వేద, తంత్ర, మంత్ర విజ్ఞాన నిపుణులకు సన్మానంతో పాటు అవార్డులు అందజేశారు. కాగా ఆయా తేదీల్లో గురూజీ అనిల్ కుమార్‌జోషి అక్కడికి వెళ్లలేకపోయారు. దీంతో నిర్వాహకులు డాక్టర్ చక్రదర్, డాక్టర్ సాగిరాజు వెంకటరాజు ఆదివారం సాయంత్రం శ్రీనిఖిల్ చేతనా కేంద్రానికి చేరుకొని గురూజీకి అవార్డు అందించడంతో పాటు సన్మానం చేశారు. అనంతరం ఆయన ఆశీర్వాదాలు తీసుకున్నారు.



గురూజీ అనిల్‌కుమార్‌జోషికి అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పూజారి రంగరాజన్, ఇన్‌చార్జి సీఐ యాదయ్య

నూతనోత్సాహం.. బాలాజీ దర్శనం

నూతన సంవత్సర వేళ ఆలయాలకు భక్తులు పోటెత్తనున్నారు. అందులోనూ వీసా దేవునిగా ప్రసిద్ధి చెందిన చిలుకూరు శ్రీ బాలాజీ దర్శనానికి అధిక సంఖ్యలో రానున్నారు. పాత సంవత్సర జ్ఞాపకాలను నెమరేసుకుంటూ, కొత్త ఆశలు, ఆశయాలతో రానున్న భక్తులకు ఆలయాధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

- నేడు చిలుకూరుకు తరలిరానున్న భక్తజనం
- భారీ ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

మొయినాబాద్: నూతన సంవత్సరం మొదటి రోజు సందర్భంగా సోమవారం చిలుకూరు బాలాజీ దేవాలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలి రానున్నారు. ఏటా జనవరి 1న చిలుకూరు బాలాజీని దర్శించుకునేందుకు సుమారు లక్ష మందికి పైగా భక్తులు వస్తుంటారు. ఈ ఏడాది సైతం అదే స్థాయిలో భక్తులు బాలాజీ దర్శనానికి వచ్చే అవకాశం ఉంది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ పూజారులు, గ్రామ పంచాయతీ, పోలీస్ శాఖ తగిన ఏర్పాటు చేశారు. ఆలయానికి రెండు కిలోమీటర్ల దూరంలోనే వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సులు సైతం రెండు కిలోమీటర్ల దూరం నుంచే వెనక్కి వెళ్లే విధంగా సూచించారు. అక్కడి నుంచే భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఆలయ ప్రాంగణంతోపాటు బయట కూడా భక్తుల క్యూలైన్ల కోసం ఏర్పాటు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి నాలుగు క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నారు. భక్తులందరికీ మహాద్వార దర్శనం ఏర్పాటు చేశారు. తెల్లవారు జాము 4 గంటలకే ఆలయాన్ని తెరిచి స్వామివారి దర్శనానికి అనుమతించనున్నట్లు ఆలయ అర్చకుడు రంగరాజన్ తెలిపారు.



చిలుకూరు బాలాజీ ఆలయం

ఏర్పాట్ల పరిశీలన

చిలుకూరు బాలాజీ దేవాలయానికి సోమవారం భారీ సంఖ్యలో భక్తులు తరలిరానుండడంతో ఆలయ అర్చకుడు రంగరాజన్, ఇన్‌చార్జి సీఐ యాదయ్య ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ పరిసరాలను గ్రామ పంచాయతీ సిబ్బంది ద్వారా శుభ్రం చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 60 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరికి తోడుగా సుమారు వంద మందికిపైగా వాలంటీర్లను అందుబాటులో ఉంచారు.

సీఐలపై బదిలీ వేటు

- మొయినాబాద్, మోకిల ఇన్‌స్పెక్టర్లను ట్రాన్స్‌ఫర్ చేస్తు కమిషనర్ అవినాశ్ మహంతి ఉత్తర్వులు
- అవినీతి ఆరోపణలే కారణమంటూ ప్రచారం

మొయినాబాద్: మొయినాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏవీ రంగాపై బదిలీ వేటు పడింది. ఈ మేరకు సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే ఐజీ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సీఐ ఏవీ రంగా మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆరు నెలలు కాకముందే బదిలీ కావడంపై స్థానికంగా సర్వత్రా చర్చనీయాశం అయింది. అవినీతి ఆరోపణలే ప్రధాన కారణమంటూ డిపార్ట్‌మెంట్‌లోనే జోరుగా ప్రచారం సాగుతోంది. 2023 జులై నెలలో ఐజీ ఆఫీస్ నుంచి సీఐ రంగా బదిలీపై మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. అప్పటినుంచి ఆయన పనితీరు సరిగా లేదని.. ప్రజలకు అందుబాటులో ఉండకపోవడంతోపాటు.. మాట్లాడే విధానం సరిగా లేదని.. స్టేషన్‌కు వచ్చేవారిని సరిగా రిసీవ్ చేసుకోరనే విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనికి తోడు ల్యాండ్ సెటిల్‌మెంట్లు చేసి అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. పోలీసు ఉన్నతాధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండానే సుమారు 25 భూములకు సంబంధించిన కేసులను సెటిల్‌మెంట్ చేసినట్లు సమాచారం. హిమాయత్‌నగర్ రెవెన్యూలో భూ కబ్జాలతో పెద్ద ఎత్తున గొడవలు జరిగాయి. ఈ కేసులో పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుని ఓ వర్గానికి అనుకూలంగా వ్యవహరించారని బాధితులు ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. ఈ కేసులో సదరు సీఐ రంగా ఉన్నతాధికారులను సైతం తప్పుదోవ పట్టించారనే ఆరోపణలున్నాయి. అవినీతి ఆరోపణల కారణంగానే ఉన్నతాధికారులు ఇన్‌స్పెక్టర్ ఏవీ రంగాపై బదిలీ వేటు వేసినట్లు ప్రచారం సాగుతోంది.



ఇన్‌స్పెక్టర్ ఏవీ రంగా

వాస్తుదోషం కలిసిరాలేదా..!

మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు జులై నెలలో బదిలీపై వచ్చిన ఏవీ రంగా పోలీస్‌స్టేషన్‌లో వాస్తుదోశాలను సరిచేసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు దక్షిణం వైపు ఉన్న ప్రధాన ద్వారం, గేటును మూసి వేయించారు. తూర్పు వైపునకు రిసెప్షన్‌ను మార్చారు. ఇన్‌స్పెక్టర్‌ను కలవాలంటే రిసెప్షన్, ఏఎస్సైలు, ఎస్సైల క్యాబిన్లను దాటుకుంటూ ఇన్‌స్పెక్టర్ గదిలోకి వెళ్లే విధంగా మార్చేశారు. అంతకు ముందు ప్రధాన గేటుకు ఎదురుగానే రిసెప్షన్ ఉండేది. అక్కడి నుంచి ఇన్‌స్పెక్టర్ గదిలోకి వెళ్లే అవకాశం ఉండేది. కానీ ఏవీ రంగా వచ్చిన తరువాత పూర్తిగా మార్చేశారు. పోలీస్‌స్టేషన్‌కు వాస్తుదోషం ఉందని.. మార్పులు చేపట్టినా ఇన్‌స్పెక్టర్ ఏవీ రంగా ఇక్కడ ఆరు నెలలు కూడా పనిచేయకపోవడం శోచనీయం.

మోకిల ఇన్‌స్పెక్టర్‌పై..

శంకర్‌పల్లి: మోకిల సీఐ నరేశ్‌పై వేటు పడింది. హైదరాబాద్ రేంజ్ డీఐజీ కార్యాలయానికి సరెండర్ చేస్తు కమిషనర్ అవినాశ్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. శంకర్‌పల్లి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు మోకిల సీఐగా బాధ్యతలు అప్పగించారు. కాగా సీఐ నరేశ్ డిసెంబర్ 22వ తేదీ నుంచి సెలవులో ఉన్నారు. కాగా ఆయన మోకిల సీఐగా బాధ్యతలు చేపట్టి సుమారు 7 నెలలు పూర్తి కావొస్తుంది. పోలీస్ స్టేషన్ పరిధిలో అవినీతికి పాల్పడుతున్నారంటూ గత కొన్ని రోజులుగా ఉన్నతాధికారులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అవినీతి ఆరోపణలు రావడంతోనే డీఐజీ కార్యాలయానికి సరెండర్ చేశారని స్థానికంగా ప్రచారం సాగుతోంది.



సీఐ నరేశ్

బెల్ట్‌షాప్‌లపై ఎస్‌ఓటీ పోలీసుల దాడి

శంకర్‌పల్లి: మండల పరిధిలోని సంకేపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఆదివారం రాత్రి ఎస్‌ఓటీ పోలీసులు గ్రామంలోని చంద్రశేఖర్, రామచంద్రయ్య దుకాణాలపై దాడులు చేసి 135 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోశ్‌కుమార్ తెలిపారు.

108వ మన్ కీ బాత్ కార్యక్రమం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 108వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ నాయకులు వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్, రాజేంద్రనగర్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు తొండుపల్లి మల్లేశ్, ఎం. భాస్కర్ యాదవ్, కె. నర్సింహా, వై. హరిగోపాల్, కె. లక్ష్మీనారాయణ, ఎ. జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన బందోబస్తు

అత్తాపూర్: నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చందానగర్ పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు చేపట్టారు. రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి, ఏసీపీ గంగాధర్, మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ మధు, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి సంబంధిత అధికారులతో కలిసి ఎక్కడికక్కడ చర్యలు చేపట్టారు. నూతన సంవత్సర వేడుకల్లో యువత అర్ధరాత్రి తరువాత రోడ్లపై తిరగకుండా ముందస్తుగా ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

అత్తాపూర్: మత్తు పదార్థాల విక్రయాలు లేని రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో ప్రత్యేక దృష్టి సారించినట్లు శంషాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గంద్ర దేవేందర్ రావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గట్టి బందోబస్తు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మత్తు పదార్థాలు కలిగి ఉండే ఉత్పత్తులను ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిషేధించడం జరిగిందని వివరించారు. గంజాయి చాక్లెట్ రూపంలో కలిగిన మత్తు పదార్థాలను విక్రయించే వారి పట్ల ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

యువకుడి హత్య

శంషాబాద్ రూరల్: గుర్తు తెలియని వ్యక్తులు ఓ యువకుడిని హత్య చేసిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏ. శ్రీధర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీషరీఫ్ ప్రాంతానికి చెందిన మల్లేష్(28) గత కొంత కాలంగా శంషాబాద్ పరిసరాల్లో కూలీ పని చేసుకుంటూ నివాసముంటున్నాడు. మండలంలోని ఘాంసిమిగూడ సమీపంలో బెంగళూరు జాతీయ రహదారి పక్కన హత్యకు గురయ్యాడు. ఆదివారం స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం అందించారు. మృతుడి వద్ద దొరికిన ఆధారాలతో అతని వివరాలు సేకరించారు. మృతుడి ఒంటిపై గాయాలుండడంతో అతన్ని హత్య చేసినట్లు గుర్తించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నమన్నారు.

హుక్కా సెంటర్‌పై దాడి

జవహర్‌నగర్: హుక్కా సెంటర్‌పై దాడి చేసి హుక్కా సామగ్రిని స్వాధీనం చేసుకున్న సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. యాప్రాల్‌లోని శైలిగార్డెన్ వద్ద ఎలెవెన్ కేఫ్ బిస్త్రోలో గుట్టుచప్పుడు కాకుండా హుక్కా సెంటర్ నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. సెంటర్ నిర్వాహకులు దీక్షిత్, శ్రీనివాస్, ప్రమోద్‌లు పరారీలో ఉండగా సూపర్‌వైజర్లు రాజశేఖర్, రమణయ్యలను అదుపులోకి తీసుకొని హుక్కా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురి అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు



స్వాధీనం చేసుకున్న డ్రగ్స్


- రాజస్తాన్ నుంచి నగరానికి తరలిస్తుండగా పట్టివేత

మీర్‌పేట: రాజస్తాన్ నుంచి నగరానికి మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర ముఠాను ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఓటీ పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఉమేష్ తివారీ(35) సనత్‌నగర్‌లో నివాసముంటూ స్టీల్ రెయిలింగ్ పనిచేస్తుండగా, ఇదే పనిచేసే రాజస్తాన్‌కు చెందిన సురేష్ దేవాసి(26)తో కలిసి డ్రగ్స్‌ను కొనుగోలు చేసి విక్రయిస్తుంటారు. రాజస్తాన్‌కు చెందిన మరోవ్యక్తి రావ్లా రామ్(22) కూకట్‌పల్లిలో ఉంటు డ్రగ్స్‌ను కొనుగోలు చేస్తుంటాడు. ముగ్గురు కలిసి నగరంలో విక్రయించేందుకు హెరాయిన్‌ని నగరానికి తీసుకొస్తుండగా సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ బృందం రాత్రి ఆర్‌ఎస్‌రెడ్డినగర్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 15 గ్రాముల హెరాయిన్, మూడు సెల్‌ఫోన్‌లు, ఒక ద్విచక్ర వాహనం రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకుని మీర్‌పేట పోలీసులకు అప్పగించారు. శనివారం ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు.

విద్యావంతులను ప్రోత్సహించాలి

- 'మోడ్రన్ ట్రెండ్స్ ఇన్ గ్లోబల్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్‌'పై సమావేశం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆధునిక యుగంలో విద్యావంతులను ప్రోత్సహించాలని పీవీ రాంరెడ్డి పీజీ కళాశాల సెక్రెటరీ పోరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడలో ఉస్మానియా యూనివర్సిటీ గోల్డెన్ సెలబ్రేషన్స్‌లో భాగంగా జాతీయ స్థాయిలో మెగా సెమినార్‌ను 'మోడ్రన్ ట్రెండ్స్ ఇన్ గ్లోబల్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. దీనికి కళాశాల కార్యదర్శి శ్రీనాథ్ రెడ్డి, డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఆధునిక యుగంలో విద్య ఎంతో అవసరమన్నారు. మేనేజ్‌మెంట్ విద్యలో జరిగే మార్పుల గురించి వివరించారు. విద్యార్థులు దానికి తగ్గట్టుగా నైపుణ్యాలను నేర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ శ్రీనివాస్, మహేష్, హరిత, శృతి, రమేష్, శ్రీదేవిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనాథ్‌రెడ్డి

లోన్ యాప్స్ దెబ్బకు డ్రగ్ పెడ్లర్‌గా మారి!

- స్నేహితుడితో కలిసి దందా ప్రారంభించిన నిరుద్యోగి
- ఢిల్లీ నుంచి తీసుకువచ్చి నగరంలో విక్రయాలు
- న్యూ ఇయర్ పార్టీల నేపథ్యంలో భారీగా ఖరీదు
- ఇరువురినీ అరెస్టు చేసిన వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: వివిధ రకాలైన లోన్‌యాప్స్ నుంచి రుణాలు తీసుకుని రోడ్డున పడిన వారిని, వారి వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్న వారినీ ఇప్పటి వరకు చూశాం. అయితే పుప్పాలగూడకు చెందిన సురే లీలా నవీన్ సాయి కథ వేరు. మాదకద్రవ్యాలకు బానిసైన ఇతడు లోన్ యాప్స్ నిర్వాహకుల ఒత్తిడి తట్టుకోలేక డ్రగ్ పెడ్లర్‌గా మారాడు. తన స్నేహితుడు బోర్రా వీర సాయి తేజతో కలిసి విక్రయానికి ప్రయత్నిస్తూ పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్‌కు చిక్కినట్లు డీసీపీ శ్రీబాల బల్లవరపు ఆదివారం వెల్లడించారు.

పంజాబ్‌లో చదువుతుండగా అలవాటు...

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మరిస్పేట్‌కు చెందిన నవీన్‌సాయి 2019 వరకు పంజాబ్‌లో లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్శిటీలో బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ చదివాడు. అప్పట్లో స్నేహితులు, రూమ్మేట్స్ ద్వారా మాదకద్రవ్యాలకు అలవాటుపడ్డాడు. ఈ జల్సా ఖర్చుల కోసం మనీ వ్యూ, జస్ట్ మనీ, ధనీ, ట్రూ బ్యాలెన్స్, పేటీఎం పోస్టు పెయిడ్, క్రెడిట్ బీ, ఎం-పాకెట్ బ్రాంచ్ తదితర లోన్ యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని అందినకాడికి రుణంగా తీసుకున్నాడు. చదువు పూర్తయ్యే వరకు, ఆపై స్వస్థలానికి వెళ్లిపోయిన తర్వాత కూడా ఈ అప్పులు తీర్చలేకపోయాడు. దీంతో వీటి నిర్వాహకుల నుంచి తీవ్ర ఒత్తిడి, బెదిరింపులు ఎదురయ్యాయి.

తోటి 'వినియోగదారుడి'తో కలిసి దందా...

ప్రస్తుతం నవీన్ సాయి ఉద్యోగాన్వేషణలో భాగంగా నగరానికి వచ్చి పుప్పాలగూడలో నివసిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు చెందిన సాయి తేజ కూడా పుప్పాలగూడలోనే ఉంటే సెల్ఫ్ డ్రైవింగ్ కార్ల వ్యాపారం చేస్తున్నాడు. ఒకే ప్రాంతంలో నివసిస్తున్న నేపథ్యంలో నవీన్ సాయి, సాయి తేజ మధ్య పరిచయం ఏర్పడింది. సాయి తేజకు కూడా డ్రగ్స్ అలవాటు ఉండటంతో తరచూ ఇద్దరూ కలిసి వినియోగిస్తుండే వారు. నవీన్ తమకు వచ్చిన డ్రగ్స్ దందా ఆలోచనను తేజకు చెప్పడంతో అతడు అంగీకరించాడు. ఇక్కడ విక్రయాల కోసం తమకు రెగ్యులర్‌కు విక్రయించే ఢిల్లీ పెడ్లర్ నుంచే ఖరీదు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇరువురు బస్సులు, రైళ్లలో ఢిల్లీ వెళ్లి అక్కడి పెడ్లర్ నుంచి తక్కువ రేటుకు డ్రగ్ ఖరీదు చేసుకుని తీసుకువచ్చి ఇక్కడి కస్టమర్లకు ఎక్కువ ధరకు విక్రయించే వాళ్లు.

'డిసెంబర్ 31' నేపథ్యంలో భారీగా...

న్యూ ఇయర్ పార్టీల నేపథ్యంలో డ్రగ్స్‌కు భారీ డిమాండ్ ఏర్పడిందని గుర్తించిన వీళ్లు ఇటీవల అక్కడకు వెళ్లి 100 గ్రాముల ఎండీఎంఏ, 11.6 గ్రాముల బ్రౌన్‌షుగర్, 2 గ్రాముల కొకైన్ ఖరీదు చేసుకుని తీసుకువచ్చారు. గ్రాము రూ.2 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున కొన్న వీటిని సిటీలోని వినియోగదారులకు రూ.6 వేల నుంచి రూ.8 వేలు, రూ.17 వేలు, రూ.10 వేలకు విక్రయించే ప్రయత్నం చేశారు. దీనిపై పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఖలీల్ పాషా, ఎస్సై ఎస్.రంజిత్ కుమార్‌లతో కూడిన బృందం ఆదివారం జూబ్లీహిల్స్‌లో ఇరువురినీ పట్టుకుంది. వీరి నుంచి సరుకు స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించింది. పరారీలో ఉన్న ఢిల్లీ పెడ్లర్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

9 కిలోల గంజాయి స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్ పోలీసులు ఆదివారం ఇద్దరు వ్యక్తుల నుంచి 9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీబీఎస్ క్రాస్ రోడ్స్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపైన అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను గమనించి అదుపులోకి తీసుకున్నట్లు సికింద్రాబాద్ సూపరింటెండెంట్ పవన్‌కుమార్ తెలిపారు. ఒడిశాలోని మల్కన్‌గిరికి చెందిన మానుష్ బిశ్వాస్, బలరాం మండల్ అనే ఇద్దరిని విచారించగా బైక్ సీట్ కింద 9 కిలోల గంజాయి ప్యాకెట్‌లు లభించాయి. వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.